క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ఇండియా సంస్థ జిల్లా కమిటీ రూపొందించిన క్యాలెండర్–2024ను కలెక్టర్ నాగలక్ష్మి శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా కమిటీ అధ్యక్షుడు పేడాడ జనార్దనరావు, ప్రధాన కార్యదర్శి కంచరాన మురళీధర్, కోశాధికారి పూజారి భాస్కరరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం కిట్ల పంపిణీ



పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న టూరిజం డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సీతారామునిపేట అంగన్‌వాడీ కార్యాలయంలో గర్భిణులకు సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో వైఎస్సార్ పోషణ ఆరోగ్య కిట్లను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టూరిజం కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు మాట్లాడుతూ.. నవజాత శిశువులు ఆరోగ్యవంతులుగా ఉండాలనే లక్ష్యంతో ఎంతో విలువైన పౌష్టికాహారాన్ని ప్రభుత్వం పంపిణీ చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్‌పర్సన్‌గా అరుణకుమారి



చిక్కాల అరుణకుమారి

నెల్లిమర్ల: పూసపాటిరేగ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా చిక్కాల అరుణకుమారి నియామయకమయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం నియామక ఉత్తర్వులు జారీ చేసింది. అరుణకుమారి 2006 నుంచి 2011 వరకు నెల్లిమర్ల మేజర్ పంచాయతీ సర్పంచ్‌గా పనిచేశారు. ఈమె భర్త చిక్కాల సాంబశివరావు వైఎస్సార్‌సీపీ నగర పంచాయతీ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా అరుణకుమారి శనివారం విలేకరులతో మాట్లాడుతూ, వ్యవసాయ మార్కెట్ కమిటీని రైతులకు మరింత చేరువ చేసి, వారికి ప్రయోజనకరంగా తీర్చిదిద్దుతామన్నారు. తనపై ఎంతో నమ్మకంతో పదవి కేటాయించిన ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

పుస్తక పఠనం అలవాటు కావాలి



బుక్‌హౌస్‌ను ప్రారంభిస్తున్న డీఎస్పీ విశ్వనాథ్

విజయనగరం ఫూల్‌బాగ్: పుస్తక పఠనాన్ని యువత అలవాటు చేసుకోవాలని ట్రాఫిక్ డీఎస్పీ డి. విశ్వనాథ్ అన్నారు. శనివారం స్థానిక కోట జంక్షన్ వద్ద విశాలాంధ్ర బుక్ హౌస్ సంచార గ్రంథాలయాన్ని ఆయన ప్రారంభించారు. బుక్‌హౌస్ జిల్లా మేనేజర్ సయ్యద్ ఇబ్రహీం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డీఎస్పీ మాట్లాడుతూ, నేటి యువత పుస్తకాలకు దూరమై, సోషల్ మీడియాకి దగ్గరయ్యారన్నారు. పుస్తకాలు చదవడం వల్ల ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఎస్సై లోవరాజు, ఏఐటీయూసీ నాయకులు రంగరాజు, గౌరినాయుడు, వేణు, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చేమకూర కవితా మైత్రి



చేమకూర కవితా వైభవాన్ని వివరిస్తున్న దశగ్రంథాల వేంకట సుబ్రహ్మణ్యం

విజయనగరం టౌన్: కౌముదీ పరిషత్ సాహిత్య, సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో స్థానిక బుక్కావీధిలో ఉన్న ఆర్యసోమయాజుల కాశీపతిరావు భవనంలో శనివారం రాత్రి నిర్వహించిన చేమకూర కవితామైత్రి విజయవిలాసం ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకుంది. ఫూల్‌బాగ్ జెడ్పీ పాఠశాల తెలుగు పండితుడు దశగ్రంథాల వేంకట సుబ్రహ్మణ్యం చేమకూర కవితామైత్రిని అభివర్ణించారు. అనంతరం ప్రముఖ రచయిత డాక్టర్ పీవీఎల్ సుబ్బారావు, సంస్థ అధ్యక్షుడు ధవళ సర్వేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి మానాప్రగడ సాహితీ ఆయన్ను దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కోశాధికారి దేవరాజు గోపాలకృష్ణ, సాహితీ అభిమానులు పాల్గొన్నారు.

హోరాహోరీ..

- ఉత్సాహంగా సాగుతున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు



విజయనగరం: రాజీవ్ క్రీడామైదానంలో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు



విజయనగరం రూరల్: చెల్లూరులో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ అప్పలనాయుడు



విజయనగరం రూరల్: దుప్పాడలో వాలీబాల్ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు



పూసపాటిరేగ: కోనాడలో క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ కల్యాణి, అప్పలనాయుడు, తదితరులు



డెంకాడ: క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ వాసుదేవరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కనకసింహాచలం, వైస్ ఎంపీపీ తమ్మునాయుడు, తదితరులు

విజయనగరం: క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సూచనల మేరకు నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు హోరా.. హోరీగా సాగుతున్నాయి. విజయనగరం కార్పొరేషన్ పరిధిలో 5వ రోజైన శనివారం స్థానిక రాజీవ్ క్రీడామైదానం ప్రాంగణంలో కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహించగా క్రీడాకారులు పోటాపోటీగా తలపడ్డారు. పోటీల్లో 25 సచివాలయాలకు చెందిన జట్లు హాజరుకాగా... మొత్తం 45 మ్యాచ్‌లు నిర్వహించినట్లు కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ పీవీడీ ప్రసాదరావు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జనవరి 9 వరకు సచివాలయ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను 10వ తేదీ నుంచి నిర్వహించనున్న మండల స్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. పోటీలను పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు, సచివాలయ కార్యదర్శులు పర్యవేక్షించారు.

ఉరకలెత్తిన ఉత్సాహం...

విజయనగరం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం... ఆంధ్రా క్రీడా పోటీల్లో యువత ఉరకలెత్తుతున్న ఉత్సాహంతో తలపడుతున్నారు. మండలంలోని చెల్లూరు, మలిచర్ల, దుప్పాడ, గొల్లలపేట, తదితర గ్రామ సచివాలయాల పరిధిలో నిర్వహించిన కబడ్డీ, ఖోఖో, క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్ పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో ఎంపీపీ మామిడి అప్పలనాయుడు పర్యటించి క్రీడాకారులతో మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో నైపుణ్యమున్న క్రీడాకారులు మట్టిలో మాణిక్యాలులా మిగిలిపోతున్నారని, వారిలో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈ పోటీలు నిర్వహిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభను వెలికితీసేందుకే..

పూసపాటిరేగ: క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకే ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా క్రీడలు నిర్వహిస్తోందని ఎంపీపీ మహంతి కల్యాణి అన్నారు. మండలంలోని కోనాడ, పేరాపురం, చింతపల్లి గ్రామ సచివాలయాల పరిధిలో నిర్వహించిన పోటీలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, క్రీడలతోనే మానసికోల్లాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి. అప్పలనాయుడు, జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసురావు, మహంతి జనార్దనరావు, దాడిశెట్టి త్రినాథరావు, అమర గురువులు, దాడిశెట్టి గోవింద, బొద్దు ఎల్లాజీ, దారపు లక్ష్మణరెడ్డి, రౌతు శ్రీరాంమూర్తి, ఎంపీడీఓ ఎం . రాధిక, ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు, ఎంఈఓలు రాజ్‌కుమార్, పాపినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సందడిగా..

డెంకాడ: గ్రామాల్లో సందడి వాతావరణంలో క్రీడా పోటీలు జరుగుతున్నాయి.డెంకాడ సచివాలయ పరిధిలో నిర్వహించిన పోటీలను ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు రొంగలి కనకసింహాచలం, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సచివాలయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారిని నియోజకవర్గ, మండల స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చందక ఆదినారాయణ, కోనాడ నాగభూషణం, రొంగలి గోపాలకృష్ణ, గుణుపూరుపేట ఉన్నత పాఠశాల పీడీ సారిపల్లి గౌరీశంకర్, సచివాలయ అధికారులు, సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.

నవరత్నాలతో సంక్షేమ వెలుగులు



భోగాపురం: మహిళకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు
- చాకివలసలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

భోగాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రూపొందించిన నవరత్నాల పథకాలతో సంక్షేమ వెలుగులు విరజిమ్ముతున్నాయని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని చాకివలసలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. గడిచిన నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన ప్రయోజనాలను కరపత్రాల ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలనే కాకుండా ఇవ్వని అనేక హామీలను కూడా అమలు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ప్రజావసరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుని తీరుస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. రానున్న ఎన్నికల్లో తమ ప్రభుత్వానికి మరో అవకాశం ఇచ్చి రాష్ట్రాభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి , పడాల భానుప్రకాష్, హౌసింగ్, మత్స్యశాఖ డైరెక్టర్లు ఉప్పాడ శివారెడ్డి, నరసింహులు, పడాల శ్రీనివాసరావు, సుందర హరీష్, లెంక రాము, అప్పురభుక్త పైడినాయుడు, ఉప్పాడ విజయభాస్కర్‌రెడ్డి, కిలారి వెంకరమణ, పూడిక నూకరాజు, కొల్లు రామ్మూర్తి, ఎంపీడీఓ అప్పలనాయుడు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.



విజయనగరం: మహిళతో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

పాలనలో వ్యత్యాసాన్ని గమనించండి: డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

విజయనగరం: గత టీడీపీ ప్రభుత్వ పాలనకు, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనకు మధ్య వ్యత్యాసాన్ని ప్రజలంతా గమనించి 2024లో జరగనున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని విజయనగరం కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి కోరారు. నగరంలోని 34వ డివిజన్ ఇందిరానగర్‌లో శనివారం సాయంత్రం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, ఏ ప్రాంతానికి వెళ్లినా జగనన్న అందిస్తున్న సంక్షేమం గురించే మాట్లాడుతున్నారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని, శాసనసభ్యుడిగా కోలగట్ల వీరభద్ర స్వామిని గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బాలి ప్రతాప్, కృష్ణంరాజు, తదితరులు పాల్గొన్నారు.

సాయికృష్ణ వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక



కార్యవర్గాన్ని ఎన్నుకుంటున్న క్లబ్ సభ్యులు

విజయనగరం: నగరంలోని శ్రీ సాయికృష్ణ వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గ ఎన్నిక శనివారం ఏకగ్రీవంగా జరిగింది. క్లబ్ గోల్డ్ డోనర్ పిన్నింటి సూర్యనారాయణ అయ్యన్నపేట జంక్షన్‌లో గల వాకర్స్ క్లబ్ నడక మైదానంలో నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. క్లబ్ నూతన అధ్యక్షుడిగా తాడ్డి ఆదినారాయణ, కార్యదర్శిగా ఐవీ ప్రసాదరావు, కోశాధికారిగా ఆర్‌సీహెచ్ అప్పలనాయుడులతో పాటు మరో 20 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ముందుగా క్లబ్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ ఏఎస్ ప్రకాశరావు, గౌరవ సలహాదారు ఎ.తిరుపతిరావు, క్లబ్ అధ్యక్షుడు సీహెచ్ శ్రీనివాసరావు నూతన కార్యవర్గాన్ని ప్రతిపాదించగా సభ్యులంతా ఆమోదించారు. త్వరలో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రకాశరావు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



ఒమ్మిలో ఘన జీవామృతం తయారీపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

నెల్లిమర్ల రూరల్: మండలంలో ఒమ్మి గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై ఆ విభాగం వలంటీర్లు శనివారం అవగాహన కల్పించారు. యూనిట్ ఇన్‌చార్జ్‌లు వల్లి గాయత్రి, అంబళ్ల రామలక్ష్మి ఆధ్వర్యంలో బొప్పాయి పంట సాగులో ఘన జీవామృతం ఎలా పిచికారీ చేయాలో రైతులకు వివరించారు. ఎకరాకు 400 కిలోల దేశీ ఆవుపేడ, 2 కిలోల పప్పు దినుసుల పిండి, 2 కిలోల బెల్లం, గుప్పెడు పుట్టమట్టి, తగినంత ఆవు మూత్రం వేసి బాగా కలుపుకోవాలన్నారు. సిద్ధమైన ఘన జీవామృతాన్ని ఉండల్లా తయారు చేసి వారం రోజుల తరువాత పొలాల్లో వేసుకోవాలన్నారు. దీనివల్ల భూమిలో సూక్ష్మజీవులు వృద్ధి చెందుతాయని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది కృష్ణ, దుర్గారావు పాల్గొన్నారు.

పోటీతత్వం అలవర్చుకోవాలి..

- ఎంపీపీ మహంతి కల్యాణి



క్రీడాదుస్తులు ఆవిష్కరిస్తున్న ఎంపీపీ కల్యాణి, అప్పలనాయుడు, తదితరులు

పూసపాటిరేగ: క్రీడాకారులు పోటీతత్వాన్ని అలవర్చుకుని ముందుకు సాగాలని ఎంపీపీ మహంతి కల్యాణి అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆడుదాం ఆంధ్రా క్రీడాకారులకు ప్రభుత్వం సమకూర్చిన క్రీడాదుస్తులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, క్రీడలతో విద్యార్థుల భవిష్యత్ బాగుంటుందని చెప్పారు. క్రీడా రంగానికి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి కోట్లాది రుపాయలు ఖర్చు చేస్తున్నారని చెప్పారు. ప్రతి ఒక్కరూ క్రీడల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి. అప్పలనాయుడు, జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, మహంతి జనార్దనరావు, గుజ్జు సురేష్‌రెడ్డి, ఎంపీడీఓ ఎం. రాధిక, ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు, మండల ఇంజినీరింగ్ అధికారి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

రవాణా రంగంలో దేశం ముందుకు..

- బీజేపీ అధికార ప్రతినిధి బవిరెడ్డి



మాట్లాడుతున్న బీజేపీ అధికార ప్రతినిధి బవిరెడ్డి శివప్రసాదరెడ్డి

విజయనగరం టౌన్: బీజేపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన వందేభారత్, అమృత్ భారత్ రైళ్ల వల్ల ప్రయాణం, పర్యాటక, రవాణా, తదితర రంగాల్లో దేశం ముందుకు పోతోందని బీజేపీ అధికార ప్రతినిధి బవిరెడ్డి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, పశ్చిమబెంగాల్ మాల్దా సిటీ నుంచి ప్రారంభమయ్యే అమృత్‌భారత్ రైలుఒడిశా మీదుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయనగరం రైల్వేస్టేషన్‌కు ఆదివారం ఉదయం 11.40 గంటలకు చేరుకుంటుందన్నారు. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ ఇమంది సుధీర్ మాట్లాడుతూ.. ప్రయాణికులు, రైలు ప్రయాణ పర్యాటకులు బీజేపీ నాయకులు, కార్యకర్తలందరూ అమృత్‌భారత్ రైలుకు స్వాగతం పలకాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మూల భూషణ్, అప్పారావు దొర, మజ్జి రమేష్, ఇప్పిలి గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా దరియాఖాన్ బాబా గంధ మహోత్సవాలు

విజయనగరం టౌన్: పట్టణంలోని కోట్లమాదప్ప వీధిలో వెలిసిన హజరత్ సయ్యద్ దరియాఖాన్ బాబా ఉరుసు చందనోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. పవిత్ర ఖురాన్ పఠనం, సలామ్, గుసుల్, సాదల్, మలాద్, తదితర కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం దర్గా ప్రాంగణంలో భారీ ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో షేక్ మహమ్మద్ సిద్ధిక్, దరియాఖాన్ బాబా వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఆజీమ్, బాబా, బహద్దూర్, రెహమాన్, తదితరులు పాల్గొన్నారు.

జనవరి ఐదో తేదీ నుంచి పింఛన్ల పంపిణీ

పూసపాటిరేగ: మండలంలోని పింఛన్ లబ్ధిదారులకు జనవరి ఐదో తేదీ నుంచి నగదు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ ఎం. రాధిక శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతమున్న 2750 రూపాయల పింఛన్‌ను మూడు వేల రూపాయలకు పెంచినట్లు పేర్కొన్నారు. మొదటి రోజు ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు చేతుల మీదుగా పంపిణీ చేస్తామన్నారు.

జనవరి ఒకటిన సేవా కార్యక్రమాలు

విజయనగరం: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో సోమవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి ఒకటో తేదీన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నగరంలో అందుబాటులో ఉందరని, ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు. అలాగే ఆరోజు ఉదయం 10:30 గంటలకు కోలగట్ల స్వగృహంలో కేక్ కట్ చేయడంతో పాటు వివిధ ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ



బాధిత చిన్నారులకు పౌష్టికాహారం అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

విజయనగరం టౌన్: ది గోల్డెన్ హెరిటేజ్ ఆఫ్ విజయనగరం చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ గ్రామాల్లో ఉన్న హెచ్‌ఐవీ బాధిత కుటుంబాల్లోని 50 మంది చిన్నారులను శనివారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. విజయా నెట్‌వర్క్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో చిన్నారులకు పెసలు, శనగలు, రాగిపిండి, బెల్లం, వేరుశనగ వంటి సరుకులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి భోగరాజు సూర్యలక్ష్మి, ఉపాధ్యక్ష్యుడు కేఆర్‌కే రాజు, కోశాధికారి రవికుమార్, సహాయ కార్యదర్శి హరగోపాల్, సభ్యులు జయ, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

రూ. 10.8 కోట్ల అంచనా బడ్జెట్ ఆమోదం



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ బంగారు సరోజిని

నెల్లిమర్ల: నగర పంచాయతీలో 2024 – 25 సంవత్సరానికి సంబంధించి రూ.10.8 కోట్ల అంచనా బడ్జెట్‌ను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. శనివారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో చైర్‌పర్సన్ బంగారు సరోజిని అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. 2023 – 24 సంవత్సరానికి సంబంధించి రూ.1.31 కోట్లు ముగింపు నిల్వగా తెలియజేస్తూ, 2024 – 25 సంవత్సరానికి రూ.9.5 కోట్ల ఆదాయం సమకూరుతుందని అంచనా వేశారు. అందులో రూ.9.3 కోట్లు వ్యయం అవుతుందని తెలిపారు. అలాగే ఇటీవల జరజాపుపేటలో జరిగిన అర్బన్ హెల్త్ సెంటర్ ప్రారంభోత్సవంలో అధికారులు ప్రొటోకాల్ పాటించలేదని సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. శిలాఫలకంలో కొంతమంది కౌన్సిలర్ల పేర్లు మాత్రమే రాయడం సరికాదని కౌన్సిలర్లు మొయిద శ్రీనివాసరావు, మైపాడ ప్రసాద్ ప్రశ్నించారు. పట్టణంలోని బయిరెడ్డి సూర్యనారాయణ కల్యాణ మంటపానికి ఆనుకుని ఉన్న స్థలంలో కన్యకాపరమేశ్వరి ఆలయం, శ్రీ కృష్ణ దేవాలయాల నిర్మాణానికి కౌన్సిల్ ఆమోదం తెలిపింది. సమావేశంలో వైస్ చైర్మన్ ఎస్. రామారావు, కోఆప్షన్ సభ్యుడు చిక్కాల సాంబశివరావు, కమిషనర్ బాలాజీ ప్రసాద్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

కందిపల్లికి డాక్టరేట్



కందిపల్లి రామకృష్ణారావు, డైట్ కళాశాల అధ్యాపకుడు

విజయనగరం అర్బన్: జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్)లో లెక్చరర్‌గా పనిచేస్తున్న కందిపల్లి రామకృష్ణారావుకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ (పీహెచ్‌డీ) లభించింది. విద్యా విభాగంలో 'పాఠశాల యాజమాన్య కమిటీల పనితీరు' అనే అంశంపై జరిపిన పరిశోధనకు గాను యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. రామకృష్ణారావును డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.తిరుపతినాయుడు, వైస్ ప్రిన్సిపాల్ యు.మాణిక్యంనాయుడు, సహ అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది అభినందించారు.

జేఎన్‌టీయూ (జీవీ) అధ్యాపకుడు గురునాథ్‌కు..



ప్రొఫెసర్ గురునాథ్‌కు డాక్టరేట్ అందజేస్తున్న వీసీ వెంకటసుబ్బయ్య

విజయనగరం అర్బన్: జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) యూనివర్సిటీలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆర్.గురునాథ్‌కు జేఎన్‌టీయూ జీవీ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఈసీఈ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ కె.బాబులు ఆధ్వర్యంలో 'ఫాల్ట్ డయాగ్నోసిస్ అండ్ అనాలిసిస్ ఆఫ్ ఎనలోజ్ సర్క్యూట్స్ యూజింగ్ వేరియస్ ఫాల్ట్ మోడలింగ్ అండ్ ఆప్టిమైజేషన్ టెక్నిక్స్' అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ వచ్చిందని గురునాథ్ తెలిపారు. ఈ మేరకు గురునాథ్‌కు వీసీ కె. వెంకటసుబ్బయ్య శనివారం డాక్టరేట్ పత్రం అందజేశారు. రిజిస్ట్రార్ జి.జయసుమ, ప్రొఫెసర్లు డి.రాజ్యలక్ష్మి, కె.బాబులు, కె.శ్రీకుమార్, బోధన, బోధనేతర సిబ్బంది అభినందనలు తెలిపారు.

సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి అచ్యుతరావు



క్రీడాకారులతో డాక్టర్ నాగార్జున, క్రీడాప్రాధికార సంస్థ అధికారి అచ్యుతరావు, తదితరులు

విజయనగరం: వివిధ క్రీడాంశాల్లో ప్రతిభ కనబరుస్తున్న క్రీడాకారులు పెద్దలు అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి అచ్యుతరావు ఆకాంక్షించారు. ఇటీవల జరిగిన ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన నలుగురు పేద క్రీడాకారులకు నాగార్జున డెంటల్ కేర్ వైద్యుడు నాగార్జున రూ.10 వేల విలువ చేసే బ్యాడ్మింటన్ రాకెట్‌లను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా అచ్యుతరావు మాట్లాడుతూ, క్రీడాకారులు కె.లోకేష్, బి.హర్షిత్, జి.నవనీత్, డి.దిలీప్‌లు భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎల్‌వీ రమణ, బ్యాడ్మింటన్ కోచ్ జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.